అస్తవ్యస్తంగా పంచాయతీల పాలన


పగలు కూడా వెలిగి ఉన్న వీధి దీపాలు

- నిత్యం వెలుగుతున్న వీధి దీపాలు
- మూడో లైను లేక సమస్యలు

పుల్లలచెరువు: యర్రగొండపాలెం నియోజకవర్గంలో పలు గ్రామాల్లో వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. కొన్ని నెలలుగా వీధి దీపాలు నిత్యం పట్ట పగలే వెలుగుతున్నాయి. పంచాయతీ పాలకులు, అధికారులు పట్టించుకోక పోవడంతో ప్రజాధనం వృథా అవుతోంది. గృహ, వాణిజ్య అవసరాలకు ఒకే లైను–గృహ, వాణిజ్య అవసరాలతో పాటు వీధి దీపాలకు ఒకే లైను ద్వారా విద్యుత్ సరఫరా అవుతుండటంతో వీధి దీపాలు నిత్యం వెలుగుతున్నాయి. గతంలో మూడో లైను ఏర్పాటు చేసుకోవాలని సూచించినా పంచాయతీలు పట్టించుకోలేదు. వాస్తవంగా వీధి దీపాలకు మూడో లైను తప్పని సరిగా ఉండాలి. లేకుంటే వీధి దీపాలు నిత్యం వెలుగుతూనే ఉంటాయి. నిత్యం పగటి వెలుగులతో ప్రతి నెలా పంచాయతీలపై అదనపు భారం పడుతోంది. దీన్ని నియంత్రించాలని వినతులు అందిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ఇప్పటికైనా వీధి దీపాల నిర్వహణపై దృష్టి పెట్టాని కోరుతున్నారు.

పంచాయతీలపై భారమే



విద్యుత్ స్తంభాలకు మూడో లైన్ లేక పట్ట పగలు కూడా వీధి దీపాలు వెలుగుతున్నాయి. గతంలో పలు మార్లు అధికారులకు తెలిపినా పట్టించుకోలేదు. మూడో లైన్ పంచాయతీలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దీనివల్ల చిన్న పంచాయతీలపై ఆర్థిక భారం పడుతుంది. చిన్న పంచాయతీలకు వచ్చే అరకొర నిధులు మూడో లైన్ ఏర్పాటు చేయడం భారమే. ప్రభుత్వమే తగు చర్యలు తీసుకోవాలి.

– ఆవుల నారాయణమ్మ, సర్పంచ్, నాయుడుపాలెం

క్లుప్తంగా

తాగునీరు విడుదల


సరఫరా అవుతున్న తాగునీరు

సాక్షి ఎఫెక్ట్..

కురిచేడు: ఎన్ఏపీ పథకం ద్వారా తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు. సాక్షి దినపత్రికలో అధికారుల నిర్లక్ష్యంతో తాగునీటికి కటకట అన్న శీర్షికన సోమవారం ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు మోటారు మరమ్మతులు చేయించి నీటి సరఫరాను పునరుద్ధరించారు. గతంలో మరమ్మతులకు గురైన రెండు మోటార్లను పట్టించుకోలేదు. వాటిని కూడా తీసుకొచ్చి వినియోగంలో ఉంచుకుంటే నీటి సమస్య రాకుండా ఉంటుంది. వేసవికాలం కావడంతో ఎండల తీవ్రతకు మోటార్లు తరుచూ మరమ్మతులకు గురవుతుంటాయి. రెండు మోటార్లు అందుబాటులో ఉంచుకుంటే మరమ్మతులకు గురైన దాని స్థానంలో మరొకటి వెంటనే ఏర్పాటు చేసి తాగునీరు సరఫరా చేయవచ్చు. అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

ప్రకృతి ఉత్పత్తులతో ఆరోగ్యం పదిలం


వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్న ఏవో ప్రసాద్‌రావు

తాళ్లూరు: ప్రతి రైతు తనకున్న పొలంలో కొద్ది పాటి నేలను ప్రకృతి సాగుతో రసాయనాలు లేకుండా పంటలు పండించుకోవాలని మండల వ్యవసాయాధికారి ప్రసాద్‌రావు అన్నారు. ప్రకృతి వ్యవసాయంతో తయారు చేసిన కూరగాయలను మండల కేంద్రంలో సోమవారం ప్రదర్శించారు. పురుగుమందులు, రసాయన ఎరువులు వాడకుండా పూర్తిగా సేంద్రియ ఎరువులతో పండించిన ఆహార ఉత్పత్తులు ఆరోగ్యకరమన్నారు. ప్రకృతి ఉత్పత్తులను అనేక మంది మండల కాంప్లెక్స్ ఉద్యోగులు కొనుగోలు చేశారని, ప్రతి సోమవారం అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఐసీఆర్పీలు కోటిరత్నం, వాణి, కోటి, అనంతలక్ష్మి, మౌనిక, పల్లవి, రైతులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కమిషనర్ రామకృష్ణయ్య

చీమకుర్తి: అభయ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో చీమకుర్తిలోని మెప్మా కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ చలివేంద్రంను మున్సిపల్ కమిషనర్ వై.రామకృష్ణయ్య సోమవారం ప్రారంభించారు. వేసవి నేపథ్యంలో మెప్మా కార్యాలయ సిబ్బందితో పాటు కార్యాలయం వద్దకు వచ్చే ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు మద్దాళి మాధవరావు తెలిపారు. ఈ సందర్భంగా మాధవరావును మెప్మా సిబ్బంది సత్కరించారు.

కేజీ పొగాకు ధర రూ.280

సంతనూతలపాడు: మండలంలోని పేర్నమిట్ట వద్ద గల ఒంగోలు–1 పొగాకు వేలం కేంద్రంలో సోమవారం నిర్వహించిన వేలంలో కేజీ పొగాకు ధర రూ.280 పలికింది. చిలంకూరు క్లస్టర్ పరిధిలో 207 బేళ్లను వేలానికి ఉంచగా, 134 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. 73 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. కేజీ కనిష్ఠ ధర రూ.260, సరాసరి ధర రూ.274.95 పలికింది. వేలంలో మొత్తం 11 కంపెనీల ప్రతినిధులు పాల్గొనగా, వేలం నిర్వహణ అధికారి ఎం.రవికాంత్ పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో వీరాంజనేయస్వామి తిరునాళ్ల


స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు


అన్నదానం చేస్తున్న కమిటీ సభ్యులు


పొంగళ్లు తయారు చేస్తున్న మహిళలు

కురిచేడు: మండలంలోని బోధనంపాడులో వేంచేసి ఉన్న శ్రీ వీరాంజనేయస్వామి తిరునాళ్ల సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు స్వామి వారికి పొంగళ్లు తయారు చేసి నివేదించి మొక్కులు తీర్చుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. పూజారులు స్వామి వారికి 5 గంటలకు పంచామృత అభిషేకం, 6 గంటలకు వివిధ రకాల పూలతో అలంకరణ, 7 గంటలకు ఆకుపూజ చేశారు. అనంతరం సాయంత్రం 4 గంటలకు గ్రామోత్సవం నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం నిర్వాహకులు తాగునీరు, అన్నదానం ఏర్పాటు చేశారు. రాత్రికి మూడు విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేసి సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.

జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి ప్రత్యేక పూజలు


పోలేరమ్మకు పూజలు చేస్తున్న వెంకాయమ్మ

దొనకొండ: మండలంలోని లక్ష్మీపురంలో గ్రామస్తులు చేపట్టిన పోలేరమ్మ జాతరకు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ సోమవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా పోలేరమ్మకు పూజలు చేశారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆమె వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డి, కర్నాటి ఆంజనేయరెడ్డి, జిల్లా యాక్టివిటీ సెక్రటరీ బత్తుల వెంకట సుబ్బయ్య యాదవ్, నియోజకవర్గ బూత్ కమిటీ కన్వీనర్ కాలూరి రమణయ్య, వడ్లమూడి బుజ్జి, నూనె వెంకటరెడ్డి, రామారావు, ఐలూరి శ్రీనివాసరెడ్డి, పత్తికొండ వెంకట సుబ్బయ్య, వీరాచారి, గొంగటి పోలిరెడ్డి, చిన్న ఇశ్రాయేల్, వెంకటరామయ్య, వల్లభ రామారావు ఉన్నారు.

ప్రశాంతంగా పది పరీక్షలు ప్రారంభం

ముండ్లమూరు (దర్శి): మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల పదో తరగతి విద్యార్థులు 472 మంది సోమవారం ప్రశాంతంగా పరీక్షలు రాశారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఏపీ మోడల్ పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు.

పుల్లలచెరువు: పదో తరగతి పరీక్షలకు సోమవారం నలుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈవో ఇందిర తెలిపారు. ఈ మేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేసింది. మండలంలోని రెండు కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయని, ఆయా కేంద్రాల్లో మొత్తం 402 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా నలుగురు మాత్రమే పరీక్షలకు గైర్హాజరయ్యారని ఆమె తెలిపారు. ప్రశాంతంగా పరీక్షలు జరుగుతున్నాయని చెప్పారు.

దొనకొండ: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 547 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా ఒక విద్యార్థి గైర్హాజరయ్యారు. ఏ సెంటర్‌లో 280 మంది, బీ సెంటర్‌లో 267 మంది విద్యార్థులకుగాను 266 మంది హాజరైనట్లు పరీక్షల చీఫ్ రమణయ్య పేర్కొన్నారు.

దళితుల భూములు ఆక్రమిస్తే సహించేది లేదు


వినతిపత్రం అందిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

తాళ్లూరు: దళితుల భూములు ఆక్రమిస్తే సహించేది లేదని ఎమ్మార్పీఎస్ నాయకులు హెచ్చరించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ సంజీవరావుకి నాయకులు వినతిపత్రం అందించారు. మండలంలోని శివరామపురంలో దళితులకు చెందిన భూమిని అదే గ్రామానికి చెందిన బొగ్గుల నరసింహారెడ్డి అనే వ్యక్తి ఆక్రమించారని స్థానిక తహసీల్దార్ సంజీవరావుకు ఇచ్చిన వినతిపత్రంలో నాయకులు పేర్కొన్నారు. భూమి ఒకరిదైతే మరొకరి భూమిలో కట్టడం నిర్మిస్తున్నారని, ప్రశ్నిస్తే భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యోడుడు రావినూతల కోటి మాదిగ, దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి ఉదయకుమార్, షడ్రక్ పాల్గొన్నారు.

శక్తి టీమ్‌ను ప్రారంభించిన డీఎస్పీ


శక్తి టీమ్‌ను ప్రారంభిస్తున్న డీఎస్పీ లక్ష్మీనారాయణ

దర్శి: నియోజకవర్గ కేంద్రం దర్శి సబ్ డివిజన్ శక్తి టీమ్‌ను డీఎస్పీ లక్ష్మీనారాయణ సోమవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శక్తి టీమ్‌లో ఎస్సై, ముగ్గురు కానిస్టేబుళ్లు ఉంటారని తెలిపారు. మహిళలకు అత్యవసర పరిస్థితిలో శక్తి టీమ్ అందుబాటులో ఉంటుందని, శక్తి యాప్‌లో ఎమర్జెన్సీ బటన్‌ను నొక్కిన వెంటనే ఆ లొకేషన్‌కు శక్తి టీమ్ చేరుకుని సమస్యను పరిష్కరిస్తుందని డీఎస్పీ పేర్కొన్నారు. మహిళలు శక్తి యాప్ డౌన్‌లోడ్ చేసుకుని ఆపద సమయంలో యాప్‌ను ఉపయోగించుకోవాలని కోరారు. దర్శి సీఐ రామారావు, దర్శి, ముండ్లమూరు, తాళ్లూరు, దొనకొండ, కురిచేడు, పొదిలి, కొనకనమిట్ల, తర్లుపాడు ఎస్సైలు పాల్గొన్నారు.

ఆబాల గోపాలంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు


శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులు


లక్ష్మీ వెంకటేశ్వరస్వామి మూలవిరాట్


పద్మావతి అమ్మవారి మూలవిరాట్


లక్ష్మీదేవి మూలవిరాట్

దర్శి: మండంలోని చలివేంద్రం సమీపంలో దేవకొండపై వేంచేసి ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి ఆబాలగోపాలంగా నిర్వహిస్తున్నారు. రెండో రోజు సోమవారం ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, నిత్యార్చనలు, నిత్య హోమం, బలిహరణ, 8 గంటలకు రాయభార మహోత్సవం, తీర్థప్రసాద గోష్టి, 10 గంటలకు స్వామివారి తిరుకళ్యాణ మహోత్సవం, సాయంత్రం 7 గంటలకు నిత్యహోమం, బలిహరణ నిర్వహించారు.

స్పందన శూన్యం..!

- స్పందన కార్యక్రమానికి అధికారుల గైర్హాజరు
- అసహనం వ్యక్తం చేస్తున్న అర్జీదారులు


సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి తక్కువ సంఖ్యలో హాజరైన అధికారులు

సంతనూతలపాడు: స్పందన కార్యక్రమానికి సోమవారం మండలంలోని పలు శాఖల అధికారులు డుమ్మా కొట్టారు. కొన్ని వారాలుగా అధికారులు గైర్హాజరవుతున్నప్పటికీ ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదు. ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగే స్పందన కార్యక్రమానికి తహసీల్దారు వేమూరి ఆదిలక్ష్మి, ఎంపీడీవో డి.సురేష్‌బాబు మాత్రమే హాజరవుతున్నారు. ఇతర శాఖల అధికారుల్లో కొందరే వస్తున్నారు. కొన్నిశాఖల అధికారులు తరచూ గైర్హాజవుతున్నారు. కలెక్టర్, జేసీ, ఇతర జిల్లా అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్పందన కార్యక్రమంపై సమీక్షిస్తున్నప్పటికీ మండల స్థాయి అధికారులు పలువురు డుమ్మాకొడుతున్నారు. అన్ని శాఖల మండల అధికారులు స్పందన కార్యక్రమానికి హాజరుకావాల్సి ఉండగా, కొందరు హాజరుకాకపోవడంతో ఆయా శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. సోమవారం జరిగిన స్పందన కార్యక్రమాన్ని మండల పరిషత్ ఏవో ఈదర విజయలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతీబాయ్, ఆర్‌డబ్ల్యూఎస్ వర్కింగ్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుబ్బారావు మాత్రమే హాజరయ్యారు. ఇతర అధికారులెవరూ రాకపోవడంతో అర్జీదారులు అసహనం వ్యక్తం చేశారు. అన్ని శాఖల మండల అధికారులు స్పందన కార్యక్రమానికి హాజరయ్యేలా జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా గోపయ్య స్వామి తిరునాళ్ల


అలంకరణలో శ్రీలక్ష్మీ తిరుపతమ్మ గోపయ్య

దొనకొండ: మండలంలోని గంగదేవిపల్లిలో వెలసిన శ్రీలక్ష్మీ తిరుపతమ్మ గోపయ్య స్వామి తిరునాళ్ల భక్తులు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చుట్టుపక్కల గ్రామాల నుంచి తిరునాళ్లకు అధిక సంఖ్యలో భక్తులు వచ్చి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు తలంటు స్నానాలు చేసి పొంగళ్లతో అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. తిరునాళ్ల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. గ్రామస్తుల సహకారంతో విచ్చేసిన భక్తులకు భోజనం ఏర్పాటు చేశారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు.

వజ్రోత్సవ సభలు జయప్రదం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న ప్రేమ్‌కుమార్

దర్శి: భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రావు, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వజ్రోత్సవాలను (ఏప్రిల్ 5 నుంచి 14 వరకు) జయప్రదం చేయాలని రాష్ట్ర దళిత సేన నియోజకవర్గ అధ్యక్షుడు జి.ప్రేమ్‌కుమార్ కోరారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద రాష్ట్ర దళిత సేన నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం రాచపూడి మోషే అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ సభల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజల సమస్యలపై చర్చించి వాటి పరిష్కారం కోసం సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సభలకు పెద్ద సంఖ్యలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలు హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు. మాల మహానాడు నాయకులు మిట్ట రమేష్, మాదిగ మహానాడు జిల్లా అధ్యక్షుడు గట్టుపల్లి ప్రసాద్, రాష్ట్ర దళితసేన నియోజకవర్గ నాయకులు దొంతులూరి కోటేష్, రాచపూడి సునీల్ పాల్గొన్నారు.

ఉగ్రనరసింహస్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత ఉగ్రనరసింహస్వామి

త్రిపురాంతకం: మండలం పరిధిలోని గుట్ల ఉమ్మడివరంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ ఉగ్రనరసింహస్వామి 21వ తిరునాళ్ల మహోత్సవాలు సోమ, మంగళ, బుధవారాల్లో నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. బ్రహోత్సవాల్లో భాగంగా ఆలయ అర్చకులు వడ్డమాని ఆత్మానందకుమార శర్మ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం ధ్వజారోహనం, స్వామి వారికి అభిషేకాలు, విశేష పూజలు చేశారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. మంగళవారం ఉదయం విష్వక్షణ ఆరాధన, పుణ్యావచనం, గణపతి పూజ, నవగ్రహ పూజ, ఆఖండ దీపారాధన, కలశస్థాపన, సుదర్శన హోమం, శ్రీలక్ష్మి గణపతి హోమం, వాస్తు హోమం, శ్రీరుద్ర హోమం, పూర్ణాహుతి పూజలు, బుధవారం ఉదయం 8 గంటల నుంచి స్వామి, అమ్మవార్ల వద్ద లక్ష కుంకుమార్చన, ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం 12 గంటల నుంచి సామూహిక 108 మంది దంపతులచే స్వామి, అమ్మవార్ల కళ్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహిస్తామని అర్చకులు పేర్కొన్నారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు, రాత్రి విద్యుత్ కాంతులతో ప్రభలు ఏర్పాటు చేయనున్నట్లు గ్రామ ప్రజలు తెలిపారు.

బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలి


ఎస్‌ఐ సంతప్‌కుమార్

పుల్లలచెరువు: ఐపీఎల్ క్రికెట్ పోటీల నేపథ్యంలో యువకులు బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ సంతప్‌కుమార్ సూచించారు. ఈ మేరకు ఆయన సోమవారం మాట్లాడుతూ ఐపీఎల్ క్రికెట్ పోటీల నేపథ్యంలో బెట్టింగ్‌రాయుళ్లు రెచ్చిపోయే పరిస్థితి ఉందని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని యువత బెట్టింగ్‌లకు ఆకర్షితులై అత్యాశతో బెట్టింగ్ కాసి మోసపోవద్దన్నారు. వీటిని ఆసరాగా చేసుకుని మాఫియా తెలివిగా పందెపు రాయుళ్లనే తమ బుకిలుగా, ఏజెంట్లుగా మార్చుకుని తమ కార్యాకలాపాలను విస్తరింపచేసుకుంటుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో యువత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బెట్టింగ్‌లు ఆన్‌లైన్ ద్వారా కాస్తూ ఆన్‌లైన్‌లో నగదు బదిలీ చేసే వారిపై పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి సారిస్తూ ప్రత్యేక నిఘా పెడుతుందన్నారు. క్రికెట్ పోటీలు చూసి ఆనందించాలి కానీ బెట్టింగ్‌ల జోలికి వెళ్లి అప్పులపాలై కుటుంబాలను, జీవితాలను నాశనం చేసుకోవద్దని యువతకు సూచించారు. మండలంలో ఎక్కడైనా ఇలాంటి కార్యకలాపాలు జరుగుతుంటే తమ దృష్టికి తీసుకు రావాలని ఎస్‌ఐ సంపత్‌కుమార్ సూచించారు.

సోషల్ ఆడిట్ సిబ్బందికి సహకరించాలి

- ఎంపీడీవో సురేష్‌బాబు, ఏపీడీ వెంకటస్వామి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సురేష్‌బాబు

సంతనూతలపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సోషల్ ఆడిట్, ఎంజీఎన్ఆర్ఈజీఎస్ కో ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంతనూతలపాడు మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద వివిధ రంగాల్లో వెచ్చించిన 8 కోట్ల 16 లక్షల 53 వేల 135 రూపాయలకు సంబంధించిన పనుల రికార్డులు, పనుల నిర్వహణపై గ్రామాల వారీగా ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, సోషల్ ఆడిట్ బృందంతో పాటు ఉపాధి హామీ పథకం సంతనూతలపాడు నియోజకవర్గ ఏపీడీ పాలేటి వెంకటస్వామి, సంతనూతలపాడు ఎంపీడీవో డి.సురేష్ బాబు సమీక్షించారు. మండలంలోని 18 గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ పనులపై గ్రామాల వారీగా సోషల్ ఆడిట్ బృందం చేసిన తనిఖీలపై సమీక్షించారు. నాలుగు కోట్ల 34 లక్షల 43 వేల 147 రూపాయలను వివిధ పనుల నిమిత్తం ఉపాధి కూలీలకు వేతనాల కింద చెల్లించగా, మిగిలిన నిధులను గ్రామాల వారీగా పలు రంగాల అభ్యున్నతికు వినియోగించారని అధికారులు తెలిపారు. గ్రామాల వారీగా జరిగిన పనులకు సంబంధించిన రికార్డులు, పనులు జరిగిన ప్రదేశాలను సోషల్ ఆడిట్ బృందానికి తెలియజేయాలని ఉపాధి హామీ పథకం సిబ్బందిని ఏపీడీ వెంకటస్వామి ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, అధికారులపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గ్రామాల వారీగా సోషల్ ఆడిట్ బృందానికి సహకరించాలని, లేనిపక్షంలో నూరు శాతం రికవరీ చేస్తామని చెప్పారు. వర్క్ ఫైలు, ఎంబుక్, పంచాయతీ తీర్మానాలు, ఎస్టిమేట్లు, శాంక్షన్, తదితరాలు తప్పనిసరిగా ఉండాలని ఏపీడీ తెలిపారు. రికార్డులు సక్రమంగా లేకపోతే చర్యలు తప్పవన్నారు. పదిమంది ఎస్ఆర్పీ, డీఆర్పీ, వీఎస్ఏ బృందం గ్రామాల్లో పనులను తనిఖీ చేస్తారని ఎంపీడీవో సురేష్‌బాబు తెలిపారు. ఈ నెల 29వ తేదీ సంతనూతలపాడులో మండల స్థాయిలో ప్రజావేదిక జరగనున్నట్టు ఎంపీడీవో వెల్లడించారు. సమావేశంలో సంతనూతలపాడు ఎంపీపీ బుడంగుంట విజయ, మండల డ్వామా ఏపీవో వాసంతి, పీఆర్ ఏఈ వీరాంజనేయులు, ఎస్ఆర్పీ మూర్తి, ఈసీ బాబు, టీఏలు, ఎఫ్ఏలు, సోషల్ ఆడిట్ బృందం, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పెద్దగుడిపాడును సందర్శించిన సీపీఎం నాయకులు


ట్యాంక్‌ను పరిశీలిస్తున్న అంజయ్య

దొనకొండ: సీపీఎం ప్రజా చైతన్య యాత్ర సందర్భంగా మండలంలోని పెద్దగుడిపాడును ఆ పార్టీ నాయకులు సోమవారం సందర్శించారు. మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య గ్రామస్తులతో మాట్లాడారు. 20 రోజుల నుంచి ఎన్ఏపీ సాగర్ జలాలు రావడం లేదని, వాటర్ ప్లాంట్, చేతి పంపు నీరు తాగి వ్యాధులకు గురవుతున్నామని అంజయ్య ఎదుట గ్రామస్తులు వాపోయారు. తాము పొలం పనులకు వెళ్లి జీవనం సాగిస్తున్నామని, ఉదయం పొలానికి వెళ్తే సాయంత్రం ఇళ్లకు వస్తున్నామని, ఇంటి పనులు చేసుకునేందుకు నీరు లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. తమ గ్రామానికి త్వరలో ఎన్ఏపీ నీరు సరఫరా చేసేలా అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు అంజయ్యను కోరారు. మార్చి 20న మార్కాపురం ఆర్‌డీఓ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో రైతులు, కూలీలు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. కుందుర్తి చిన్న నరసింహులు, సంతోష్‌కుమార్, గ్రామస్తులు ఉన్నారు.